క్లుప్తంగా

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన



సీసీఎంబీ వద్ద అధ్యాపకులతో విద్యార్థులు

కొడంగల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు హైదరాబాద్‌లోని సీసీఎంబీలో మంగళవారం రసాయన శాస్త్రం, జంతుశాస్త్రంపై అవగాహన కల్పించారు. సీసీఎంబీ ఓపెన్ డే సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. ఇందులో అధ్యాపకులు హరిప్రియ, శ్రీధర్, రమేష్, లక్ష్మి ఉన్నారు.

సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లి ఎంబీజీలో వెలసిన రాఘవేంద్ర స్వామి ఆలయంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఉదయం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ప్రత్యేక హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కౌన్సిలర్ మధుయాదవ్



పూజలో పాల్గొన్న భక్తులు

కొడంగల్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కౌన్సిలర్ మధుయాదవ్ అన్నారు. మంగళవారం ఆయన తెలుగుగేరి నందీశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించారు. గణేశ్ మంటపంలో పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కౌన్సిలర్ మాట్లాడారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ప్రజలు కడుపు నిండా తిని ఆశీర్వదిస్తారని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా వినాయక ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, అర్చకుడు గడ్డం చంద్రశేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు, అలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేశం



మల్లేశంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

బంట్వారం: బీఆర్‌ఎస్ బంట్వారం మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుర్గంచెర్వు మల్లేశం నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆనంద్ మంగళవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మల్లేశంను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మనస్పర్థలు వీడి సమన్వయంతో ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. మరోసారి బీఆర్‌ఎస్‌దే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీఓ అనిత

కుల్కచర్ల: గ్రామానికి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని డీఎల్‌పీఓ అనిత సూచించారు. మంగళవారం కుల్కచర్ల, ముజాహిద్‌పూర్‌లో పర్యటించి జీపీల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలకు అవసరమైన తక్షణ అవసరాలను గుర్తించి, ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. ఎంపీఓ ఖరీం, సర్పంచులు సౌమ్యారెడ్డి, లక్ష్మి, జీపీ కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌దే అధికారం!

కడ్తాల్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో, గ్యారెంటీలతో ప్రజలను మభ్యపెట్టాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారని, ప్రజలు హామీలను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయం తథ్యమన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం..

- సీజనల్ వ్యాధుల ముప్పేట దాడి
- వైరల్ ఫీవర్‌తో ఆసుపత్రుల పాలు
- పెరిగిన ఊపిరితిత్తుల వ్యాధి గ్రస్తులు
- మున్సిపాలిటీలో 2 డెంగీ, 30 అతిసార కేసుల నమోదు

పురపాలికలో పౌర సేవలు స్తంభించాయి! ఇంటి పన్ను, ఆస్తి పన్నుల వసూలుకు మొగ్గు చూపే మున్సిపాలిటీ అధికారులు, పాలకులు.. పారిశుద్ధ్యం లోపించి, ప్రజలపై సీజనల్ వ్యాధులు ముప్పేట దాడి చేస్తున్నా.. పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇళ్ల మధ్య నిలిచిన మురుగు జలాలు, పేరుకుపోయిన చెత్తాచెదారంతో డెంగీ, తదితర రోగాల బారిన పడిన బాధితులతో ఆసుపత్రులు రద్దీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో దవాఖానాలు, పుర పరిసర ప్రాంతాలను 'సాక్షి' విజిట్ చేయగా.. జానారోగ్యంపై ప్రభావం చూపుతున్న పలు అంశాలు వెలుగు చూశాయి.



7వ వార్డులో రోడ్డుపక్కనే నిలిచిన మురుగు జలాలు

తాండూరు: తాండూరు మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండగా, 14,500 వరకు ఆవాస గృహాలు ఉన్నాయి. 80 వేల మందిపైగా జనాభా నివసిస్తున్నారు. నెల రోజులుగా కురుస్తున్న ఏకధాటి వర్షాలతో వార్డులన్నీ అధ్వానంగా మారాయి. వీధుల్లోని అంతర్గత రోడ్లపై మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. పలు వార్డుల్లో మురుగు కాల్వలు లేకపోవడంతో సమస్య జఠిలంగా మారింది. మురుగు కాల్వలు నిర్మించకుండానే మున్సిపల్ యంత్రాంగం సీసీరోడ్లను నిర్మిస్తోంది. దీంతో మురుగు నీటి ప్రవాహానికి కాలువలు లేకపోవడంతో మురుగు జలాలు నివాసాల మధ్యే నిలిచి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది. దీంతో మున్సిపల్ పరిధి 2,4,5,7,12,13వ వార్డుతో పాటు గొల్లచెరువు, పాత తాండూరు ప్రాంతాల్లో నివసించే ప్రజలు వైరల్ ఫీవర్ బారిన పడుతున్నారు.

దోమల దండయాత్ర

మురుగు కాలువలు లేక, వ్యర్థ జలాలు ఎక్కడపడితే అక్కడ నిలిచాయి. దీంతో అవి దోమలకు ఆవాసాలుగా మారగా.. దోమకాటుతో ప్రజలకు అనారోగ్యం పాలవుతున్నారు. దోమలను నియంత్రించేందుకు మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గతంలో రూ.లక్షలు వెచ్చించి వాటి నివారించేందుకు ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. కాని అవి మున్సిపల్ భవనం దాటి బయటకు తీయలేదు.



పట్టణంలో రొడ్డుపైనే పారుతున్న మురుగు

దోమలు అధికం



మున్సిపాలిటీలో దోమలు బాగా పెరిగాయి. ఫాగింగ్ యంత్రాలతో వాటిని నియంత్రించాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. ఇక వార్డుల్లో మురుగు కాల్వలు లేకపోవడంతో వ్యర్థ జలాలు రోడ్లపైనే ప్రవహిస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– బంటు వేణుగోపాల్, తాండూరు మున్సిపాలిటీ

పెరిగిన వైరల్ ఫీవర్ కేసులు



ఇటీవల కురిసిన వర్షాలతో విష జ్వరాల కేసులు చాలా పెరిగాయి. ఆసుపత్రికి వచ్చిన బాధితులకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి వడపోసిన నీటినే తాగాలి. బయటి తినుబండారాలకు దూరంగా ఉండాలి. దోమ తెరలను ఉపయోగించాలి.

– కేవీఎస్ మూర్తి, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, తాండూరు

డెంగీతో జాగ్రత్తగా ఉండాలి..



డెంగీ బాధితుడితో మాట్లాడుతున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: డెంగీ, సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ సూచించారు. మంగళవారం కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన హరిజన నర్సింహ(28)కు కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగీ నిర్ధారణ అయింది. దీంతో బాధిత కుటుంబీకుల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్య సమస్యలతో బయట తిరగొద్దని సూచించారు. వైద్యులు సూచించిన ప్రకారం మందులు వాడాలని చెప్పారు. ఇందులో వైద్య సిబ్బంది వెంకన్న, వెంకటయ్య, యాదమ్మ, భారతమ్మ, మంగమ్మ ఉన్నారు.

నిత్యం 250 కేసులు!



వైద్య సేవలు పొందుతున్న రోగులు

తాండూరు జిల్లా ఆసుపత్రిలో జ్వర పీడితులు వైద్య సేవలు పొందుతున్నారు. నెల రోజుల వ్యవధిలో 10 వేల మంది విష జ్వరాలతో వైద్య సేవలు పొందారని ఆసుపత్రి సూపరింటెండెంట్ కేవీఎస్ మూర్తి తెలిపారు. సోమవారం రోజు 250 మంది రోగులు వైరల్ ఫీవర్‌తో రాగా.. అందులో 25 మందిని అడ్మిట్ చేసుకొని, వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. మిగతా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులకు పంపిణీ చేసి ఇంటికి పంపించామని, అతిసార కేసులు 30 నమోదయ్యాయని పేర్కొన్నారు.

నేటి నుంచి రేవంత్ నివాసంలో పూజలు

కొడంగల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ నివాసంలో బుధవారం నుంచి చండీ హోమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తెలిపారు. పట్టణంలోని లాహోటీ కాలనీలో ఉన్న రేవంత్ నివాసానికి మరమ్మతులు చేశారు. పనులు పూర్తి అయిన తర్వాత శాంతి పూజలు చేయాలనే ఉద్దేశంతో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం 29న అన్నదానం చేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, రేవంత్ అభిమానులు రావాలని కోరారు.

1న సాయన్న విగ్రహ ఆవిష్కరణ

కుల్కచర్ల: పండగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలముకుందం, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. మంగళవారం కుల్కచర్ల, చౌడాపూర్‌లో సంఘం సభ్యులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ముదిరాజ్‌ల అభ్యున్నతికై పాటుపడిన సాయన్న విగ్రహాన్ని అక్టోబర్ 1వ తేదీన పరిగిలో ప్రతిష్ఠించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో పరిగి వైస్ ఎంపీపీ సత్యనారాయణ, చాపలగూడెం సర్పంచ్ లక్ష్మణ్, నాయకులు నగేశ్, బాబయ్య, శ్రీశైలం, నర్సింహులు, మాసయ్య, ఆంజనేయులు, మైపాల్, కర్ణయ్య, వెంకటయ్య, సాయిలు, మైపాల్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

తాండూరు రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధి అంతారం శివారు అర్బన్‌పార్కులో విద్యార్థులతో కలిసి సీడ్ బాల్స్ విసిరారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి వెంకట్, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు బాలకృష్ణ, బసవరాజ్, ఫారెస్ట్ అధికారి నాగజ్యోతి, పాఠశాల డైరెక్టర్ ద్యావరి జయవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం



రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

పరిగి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు నిరసన వ్యక్తంచేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించగా.. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీలు మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా తమను గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం చెల్లించాలని కోరారు.

దేశ సేవకు వెళ్లడం సంతోషం



అనిల్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

పరిగి: దేశ సేవకోసం వెళ్లడం ఎంతో సంతోషమని ఎంపీటీసీ వెంకట్ రాంరెడ్డి అన్నారు. మండల పరిధి సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన కొప్పు అనిల్ అగ్నివీర్‌కు ఎంపిక కావడంతో మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశ సేవలో పేరుప్రఖ్యాతులు తేవాలని కోరారు. ఇందులో గ్రామ పెద్దలు శ్రీనివాస్, సుభాష్ చందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కృష్ణయ్య, నర్సింహులు, ప్రదీప్‌రెడ్డి ఉన్నారు.

పార్టీని మోసం చేసిన ఎమ్మెల్యేను ఓడిస్తాం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు. మంగళవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్‌తో కలిసి మండలంలోని కోత్లాపూర్, కరన్‌కోట్, అంతారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌ను మోసం చేసిన ఎమ్మెల్యే రోహిత్ రెడ్డిని ఓడించి, తగిన బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కోత్లాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ ఆలివేలు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గోపాల్‌తో 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, ఉత్తమ్‌చంద్, నాగప్ప, రాజ్‌కుమార్, నర్సింహులు, పురుషోత్తంరెడ్డి, జర్నప్ప, అశోక్, జగదీష్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **భక్తితో సత్ప్రవర్తన**



బషీరాబాద్: భక్తిమార్గంతో మనుషుల్లో సత్ప్రవర్తన వస్తుందని అంబాభవానీ మాత పీఠాధిపతి, తెలంగాణ సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ స్వామిజీ అన్నారు. మండల పరిధి దామర్‌చెడ్‌లో భవానీనగర్‌లో వెలసిన అంబాభవానీ మాతను మంగళవారం భక్తులు దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు పీఠాధిపతి ప్రవచనాలు బోధించారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిక**

అనంతగిరి: వికారాబాద్ మండలం రాళ్ల చిట్టంపల్లి గ్రామానికి చెందిన పలువురు మంగళవారం మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇందులో మాజీ జెడ్పీటీసీ మైపాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు జాఫర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు కమల్ రెడ్డి, నగేశ్, నిజాముద్దీన్, యాదయ్య ఉన్నారు.

◆ **విత్తన బంతులు విసిరిన విద్యార్థులు**

బొంరాస్‌పేట: రామకృష్ణ సేవాసమితి తాండూరు ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధి తుంకిమెట్ల అటవీ ప్రాంతంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు విత్తన బంతులు విసిరారు. విత్తన బంతుల విధానంతో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఉపాధ్యాయులు అన్నారు. ఇందులో సమితి ప్రతినిధి వెంకటేశ్, టీవీవీ నాయకుడు రవీందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, గోపాల్, ప్రవీణ్‌కుమార్, వెంకటయ్య ఉన్నారు.

◆ **సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి**

తాండూరు: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తాండూరు షీటీం ఇన్‌చార్జి శేఖర్ అన్నారు. మంగళవారం తాండూరు పట్టణ శివారు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మూఢ విశ్వాసాలకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆపద సమయంలో విద్యార్థులు 100, లేదా 181 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలన్నారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ సురేఖ, ఉపాధ్యాయులు, షీ టీం సిబ్బంది ఉన్నారు.

◆ **కొనసాగుతున్న నిరసనలు**

అనంతగిరి: మెగా డీఎస్సీని వేయాలని కోరుతూ వికారాబాద్‌లో డీఎస్సీ అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. ఇందులో మంగళవారం వికారాబాద్‌లో బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే డీఎస్సీ పోస్టులను పెంచి రీ నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేశారు.

◆ **పథకాన్ని సద్వినియోగం చేసుకోండి**

దోమ: ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కృష్ణ సూచించారు. మంగళవారం దాదాపూర్ గ్రామస్తులకు పీఎంజేఏవై, ఆరోగ్యశ్రీ కార్డులకు ఆయన దరఖాస్తు చేయించి మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చిందని, దీనిని ఆయుష్మాన్ భారత్ యోజన అని కూడ పిలుస్తారని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన ఒక్కో కుటుంబానికి కేంద్రం యేటా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తుందని అన్నారు.

◆ **అదృష్టంగా భావించాలి**



కుల్కచర్ల: సైన్యంలో చేరడం అభినందించదగ్గ విషయమని సర్పంచ్ పాండురంగయ్య అన్నారు. చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన కోట్ల శ్రీకాంత్ ముదిరాజ్ టెక్నికల్ సోల్జర్‌గా సైన్యంలో చేరనున్న నేపథ్యంలో మంగళవారం శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. ఇందులో పిట్ల నర్సింహులు ముదిరాజ్ ఉన్నారు.

◆ **అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు**

మర్పల్లి: ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు వస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ నర్సింహ్మారెడ్డి అన్నారు. కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన గోపాల్, మురళి, అపర్ణలకు అధ్యాపక బృందం మంగళవారం ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికింది. ఇదులో అధ్యాపకులు పండరీనాథ్, గురుపాదం, వీరేశం, భాస్కర్, కార్తీక్, రఘువీర్, లక్ష్మణ్, మహేశ్, శంకర్, వెంకటేశం, మజీద్, రవి, సమీనా, జమీర్, పెంటయ్య, చంద్రయ్య ఉన్నారు.

◆ **'ఆర్యవైశ్య దీక్ష'కు తరలిరండి**



వికారాబాద్ అర్బన్: ఈనెల 30న జరగబోయే 'ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్ష' వాల్‌పోస్టర్‌ను మంగళవారం వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ఆవిష్కరించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద దీక్ష ఉంటుందన్నారు. దీక్షకు ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా, వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి యాష్కీ సునీల్, ఉపాధ్యక్షుడు రఘునందన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **వైద్య శిబిరాలను వినియోగించుకోండి**

పరిగి: ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని వైద్యులు సూచించారు. మంగళవారం పట్టణ కేంద్రం సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శ్రీసాయి దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా.. 430 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం ఏమైనా సమస్యలు ఉంటే.. సాయి దంత వైద్యశాలలో మెరుగైన చికిత్స అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

◆ **స్వచ్ఛతపై అవగాహన**

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో సర్పంచ్ భూపాలచారి ఆ ధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతపై అవగాహ న నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భూపాలచారి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామాల్లో 'స్వచ్ఛత హీ సేవ' నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో చెత్తాచెదా రం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని కోరా రు.



కొడంగల్ రూరల్: మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

నిమజ్జనోత్సవం..

చవితి నవరాత్రోత్సవాల్లో భాగంగా మండపాల్లో కొలువుదీరిన వినాయకుడు నిత్యం పూజలందుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటుండగా.. మరికొన్ని చోట్ల నిమజ్జనానికి సన్నాహాలు చేశారు. ఇందులో భాగంగా పలుప్రాంతాల్లో మంగళవారం వేలం పాటలో భక్తులు లంబోదరుడి లడ్డూ దక్కించుకున్నారు. అనంతరం శోభాయాత్రగా గణపతిని గంగమ్మ ఒడికి చేర్చారు.

–సాక్షి, నెట్‌వర్క్



పరిగి: లక్నాపూర్ ప్రాజెక్టు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్ అశోక్‌కుమార్



వికారాబాద్: మద్గుల్ చిట్టంపల్లిలో నిమజ్జన సంబురాలు



మోమిన్‌పేటలో.. వినాయకుడి శోభాయాత్ర



బొంరాస్‌పేట: నిమజ్జన పూజలు



కొడంగల్: నిమజ్జన వేడుకల్లో మహిళలు